“కుట్ర” అన్న పదం అసందర్భంగానూ, ఆమె భ్రమ గానూ అనిపించినా ఆ విషయంపై చర్చ పొడిగించ కూడదనుకున్నాడు. అందుకే “ఎప్పుడైనా అతడ్ని ఎందుకు అడగలేక పోయావు ?” అన్నాడు.

“అడగ్గలిగేటంత సాన్నిహితత్వం ఏర్పడక.”

ఆమె జవాబు అతనికి చాలా విచిత్రంగా అనిపించింది.

“మరి అలాంటి అనుమానం వచ్చినపుడు నీ వెందుకు అడగలేక పోయావు”

“సరైనా అవకాశం రాక”

సముద్రంపైన చీకటిని చీల్చుతూ లైట్ హౌస్ కాంతి గిర్రున తిరుగు తుంది.

అప్పటికే బాగా చీకటి పడడంతో బీచ్‌లో సందడి పూర్తిగా తగ్గిపోయింది.

మరో అరగంట మౌనంగా కూర్చున్న శిల్ప, యోగేంద్రలు తొమ్మిది గంటల ప్రాంతంలో ఇంటికి బయలు దేరారు.

హాలులో పేపరు తిరగేస్తూ కూర్చున్న కిరీటి యోగేంద్రను చూడగానే మృదువుగా మందహాసం చేశాడు.

శిల్పకు అతడ్ని ఉడికించాలనిపించింది.

అందుకే యోగేంద్ర అతడితో మాటలుపక్రమించ బోతుంటే, “రా బావా భోంచేద్దాం” అంటూ బలవంతంగా డైనింగ్ హాల్లోకి లాక్కుపోయింది.

కిరీటికి వినపడేట్టుగా పగలబడి నవ్వుతూ శిల్ప గట్టిగా మాట్లాడుతుంటే యోగేంద్ర ఇబ్బందిగా భోజనం పూర్తి చేశాడు.

డిన్నరు ముగించాకయినా కిరీటితో కొంతసేపయినా మాట్లాడాలనుకున్న యోగేంద్ర ప్రయత్నాన్ని ఆమె కొనసాగించలేదు.

అతనికి చేరువగా సోఫాలో కూర్చుని చిన్నప్పటి ముచ్చట్లు మాట్లాడుతుంటే ఏం చెయ్యాలో యోగేంద్రకు పాలుపోలేదు.

చాలా సేపు మౌనంగా పేపరులోకి చూస్తూ కూర్చున్న కిరీటి వాళ్ళకు మాట్లాడుకునే అవకాశం ఇస్తున్నట్టుగా లేచి “ఓ కె యోగీ! రేపు ఉదయం ఆఫీసులో కలుసుకుందాం ” అంటూ బెడ్‌రూమ్‌లోకి నడిచాడు.

కిరీటి తమకు దగ్గరలో కూర్చోవాలని తాను మరింత రెచ్చిపోతూ యోగేంద్ర దగ్గర చనువును ప్రదర్శించి అతడ్ని బాధ పెట్టాలని అనుకున్న శిల్ప అతడు వెళ్ళిపోవటంతో నీరస పడిపోయింది.

మరో పది నిమిషాలయ్యాక యోగేంద్ర వెళ్ళి పోయాడు.

ఎంత బావైతే మాత్రం అంత చనువును ప్రదర్శించటం తనకిష్టం లేదని చెప్పటానికి కిరీటి రావాలని, అలావస్తే కన్య విషయంలో అతని ప్రవర్తన గుర్తు చేస్తూ కడిగేయలని అనుకుంది.

కాని కిరీటి ఎంత సేపటికీ రాకపోవటంతో ఉక్రోషం వచ్చి అలాగే నిద్రపోయింది.

కిరీటితో పోరాటమే తన ధ్యేయంగా ప్రొద్దుటే లేచిన శిల్ప అతడు అప్పటికే ఆఫీసుకి వెళ్ళే ప్రయత్నం చేస్తుంటే, "నాకు ఫోర్డ్ కావాలి " అంది.

అతడు ఎందుకు, ఏమిటి అని అడిగితే పేచీ పెట్టుకోవాలనుకుంది. కాని కిరీటి మారు మాట్లాడకుండా ఫోర్డ్ కారు వదిలి పెట్టి మరో కారులో ఆఫీసుకి వెళ్ళిపోతుంటే ఉస్సూరుమంటూ సోఫాలో కూలబడిపోయింది-- కయ్యమాడే అవకాశం తప్పిపోయినందుకు చింతిస్తూ.

అంతటితో ఆగటం ఆమెకు ఇష్టంలేదు.

కిరీటిపై అంతకంతకు ఉక్రోషం ఎక్కువై పోతుంటే పది గంటలకల్లా ఆఫీసుకి ఫోన్ చేసింది.

కిరీటి ఫోన్ అందుకుని, "ఏం- టొయాటో కూడా కావాలా"అని మామూలుగా అడిగే సరికి "నో థాంక్స్ మాబావ కావాలి" అంది అనాలోచితంగా ...

ఆ సమయానికి యోగేంద్ర అక్కడ వుంటాడని ఆమె వూహించలేదు.... కాని ఫోనులో యోగేంద్ర పలకరించే సరికి ఏం మాట్లాడాలో కొన్ని క్షణాల వరకూ తట్టలేదు.

వెంటనే ఏదో గుర్తు చేసుకుని "నాకోసం మూడురోజులు స్పేర్ చేస్తావని ప్రామిస్ చేశావు" అంది గట్టిగా కిరీటికూడా తన కంఠం వినబడాలన్న తలంపుతో .

"శిల్పా! కాస్త నెమ్మదిగా మాట్లాడలేవూ " అసహనంగా అన్నాడు యోగేంద్ర.

"ముందు నేను అడిగిన దానికి జవాబు చెప్పు"

"కాని నాకు అర్జెంటుగా పనుంది..."

"అదేం కుదరదు ... లీలాలో మంచి మార్నింగ్ షో వుంది.... ఎలాగైనా వచ్చి తీరాలి ... రాకపోతే ఊరుకునేది లేదు" అంది కసురుకున్నట్టుగా .

"మరో రోజు ప్లాన్ చేసుకుంటే బాగుంటూంది."

"కాదు ఈరోజే... ఇప్పుడే.... ఏం.... రావటం ఇష్టం లేదా" అల్టిమేటమ్ ఇస్తున్నట్టుగా అంది.

"సరే ..."

"సరే అంటే సరిపోదు .... వచ్చి తీరాలి .... రాకపోతే నాకంటే వాళ్ళు, వాళ్ళపనులే ముఖ్యమనుకుంటాను. వాళ్ళతో నువ్వూ చేతులు కలిపి నన్ను సాధించే ప్రయత్నం చేస్తున్నావన్న నిర్ణయానికి వస్తాను" సీరియస్‌గా అని ఫోన్ పెట్టేసింది.

ఆమెకిప్పుడెంతో హాయిగా వుంది.

పరోక్షంగా కిరీటిపై పగ దీర్చుకుంటున్నందుకు మహాదానందంగా వుంది.

మరో పది నిమిషాల్లో కల్లా యోగేంద్ర బంగళాకి వచ్చాడు.

పోయింది. కారణం ఆమె ముఖ్యోద్దేశం కిరీటిని అవమానించటమే కాని సినిమా చూడటం కాదు కాబట్టి....

అలా కొత్త పంథాలో యోగేంద్రను మొహమాటపెడుతూ కిరీటిని సాధించాలని నిర్ణయం తీసుకుంది కాని మరుసటి రోజే కిరీటి వచ్చి తను బాంబే టెక్స్‌టైల్ మిల్ విజిటింగ్‌కు వెళ్తున్నానని చెప్పినపుడు ఎంతో బాధపడింది.

ఆమె బాధ కిరీటి బాంబే వెళ్తున్నందుకు కాదు.... వెళ్ళి ఓ వారం రోజులు అక్కడే వుంటానన్నందుకు. తన పథకం సజావుగా సాగకుండా మధ్యలోనే అవాంతరం వచ్చి పడినందుకు .....

కిరీటి సాయంకాలం ఫ్లయిట్‌కు బయలు దేరుతూ, "బాంబేలో నాకు ట్రేడ్ యూనియన్ నెగోషియేషన్స్ కూడా వున్నాయి కాబట్టి బహుశా రావటం మరింత ఆలస్యం కావచ్చు. ఎలాగూ మీ బావ వున్నాడుగా, నీకు టైమ్ గడవటం కష్టం కాదనుకుంటాను" అంటూ చెప్పేసరికి ఎగతాళిగా అనిపించాయి.

అంతకంటే తనను హద్దుల్లో వుండమని హెచ్చరిస్తే ఆమె అనందించి వుండేది.

యోగేంద్రతో చెట్టా పట్టా లేసుకు తిరగటం తనకు ఇష్టంలేదని నిలదీస్తే ఆమె సంతోషపడేది.

తనతో బాంబే రమ్మని ఆహ్వానించి వుంటే అయిష్టాన్ని నటిస్తూనైనా అతనితో బయలుదేరి కాస్త ఊరట చెందేది.

కాని అతడలా ప్రవర్తించకపోవటంతో తన అంచనా తప్పినందుకు రోషం వచ్చి, "నాకెవరి సలహాలూ అక్కరలేదు" అంటూ చరచరా తన గదిలోకి నడిచింది.

## 22

స్కూలు బిల్డింగ్ నిర్మాణం ముమ్మరంగా సాగుతుంది.

తను స్టేట్స్ వెళ్ళాల్సిన గడువు దగ్గర పడటంతో యోగేంద్ర నిర్మాణం విషయాంలో చాలా బిజీ అయిపోయాడు.

ఇంచు మించు ప్రతిరోజూ సాయంకాలం కన్యను కలుసుకుని "వర్క్ ప్రోగ్రెస్ " గురించి యోగేంద్ర వివరిస్తూనే వున్నాడు.

అప్పటికి కిరీటి బాంబే వెళ్ళి వారం రోజులైంది.

యోగేంద్ర కూడా కన్‌స్ట్రక్షను మూలంగా అరుదుగా వస్తుండటంతో కన్యకు కూడా ఉబుసుపోవటం కష్టమైంది.

అదీ కాకుండా ఆంటీని కలుద్దామని నానీ చాలా రోజులుగా మారాం చేస్తున్నాడు.

శిల్ప నోమారు కలువాలనిపించింది.

తనను ద్వేషించే శిల్పతో నెమ్మదిగా పరిచయం పెంచుకోవాలని తనకు కిరీటికి మధ్య

ఆమె అంగీకరిస్తే తన కథనంతా చెప్పి వారి మధ్య అన్యోన్యతకు వంతెన వేయాలని కలలు కంటోంది.

ఒకవేళ తన ప్రయత్నాన్ని కాదని శిల్ప అవమానించి పంపినా చూసి బాధపడటానికి కిరీటి ఊళ్ళోలేడు కాబట్టి ఇదే మంచి అవకాశం అనుకుని నానితో సహా శిల్ప దగ్గరకు బయలుదేరింది.

కన్య ఊహించినట్టుగానే శిల్ప ఆప్యాయంగా ఆహ్వానించలేదు.

ఆమె వేపు నిర్లక్ష్యంగా చూస్తూనే నానీని దగ్గరకి తీసుకుంది.

శిల్ప కూర్చోమని చెప్పకపోయినా ఆమె ఎదుటే సోఫాలో కూర్చుంది,

తన వునికినే గమనించనట్టుగా నానీతో ముచ్చటలాడుతుంటే ఏదో ప్రసక్తి తేవాలి కాబట్టి, “కిరీటి ఎప్పుడు వచ్చేది ఫోన్ చేశాడా?” అని అడిగింది కన్య.

అవహేళనగా చూసిన శిల్ప, “అదేమిటి పాపం.... ఒక్కరోజు మిమ్మల్ని చూడకుండా వుండలేరే.... ఇన్నాళ్ళూ ఫోన్ కూడా చేయలేదంటే చిత్రమే మరి” వ్యంగ్యంగా అంది.

తన విషయంలో శిల్ప ఇంకా అపోహ పడుతూనే వుందన్న సత్యాన్ని గ్రహించిన కన్య నిబ్బరంగా నవ్వింది.

తను చెప్పాలనుకున్న విషయాన్ని ఎలా ఎక్కడ నుండి మొదలు పెట్టాలా అని ఆలోచించింది.

“మీకు ఒంటరిగా ఉబుసు పోవటంలేదేమోనని అలా స్కూలు బిల్డింగ్ సైట్‌కు తీసుకు వెళదామని వచ్చాను” మృదువుగా అంది. అలా ప్రసక్తిని ప్రక్కకు మళ్ళించటంలో కన్య ఉద్దేశ్యం శిల్పను కాస్త చల్లబరచాలని....

కాని ఆమె ఊహ తప్పన్నట్టుగా శిల్ప విరుచుకు పడింది.

“ఏం... ఆ బిల్డింగ్ చూపించి ఆయనగారికి మీరంటే ఎంత అపురూపమో నిరూపించుకోవాలనుకుంటున్నారా .....? లేక పోతే ఆయన ఇంతవరకు అలా కట్టించిన ప్రేమ మందిరాలనన్నింటినీ చూపి పుష్పక విమానంలో ఆయన మనసెంత విశాలమో నచ్చచెప్పాలనుకుంటున్నావా ?”

సడలిపోతున్న నిగ్రహాన్ని ఉబికివస్తున్న కన్నీళ్ళను అదిమి పెడుతూ “నా విషయంలో మీరు చాలా పొరపాటు పడ్డారు శిల్పా!” అంది.

“ఏమిటి నా పొరపాటు... మీరు కిరీటి మాజీ ప్రియురాలనుకోవటం పొరపాటా... నానీని మీరు కిరీటికే కన్నారనుకోవటం పొరపాటా... పెళ్ళి చేసుకున్న కిరీటిని మీరు ఇంకా ప్రేమిస్తూ నా కాపురంలో చిచ్చు పెడుతున్నారను కోవటం పొరపాటా... ఏమిటి నా పొరపాటు?”

శిల్ప మాటలు వినలేక చెవులు మూసుకున్న కన్య కళ్ళల్లోకి నీరు వుబికింది.

“అవును ... కిరీటిని ప్రేమించాను ...” ఆవేశాన్ని అదుపులోకి తెచ్చుకున్నట్టుగా ఒక్క క్షణం ఆగింది కన్య.

"కాని ఇప్పుడు కాదు... నా వివాహానికి ముందు... ధైర్యంగా నాన్నగారితో నిజం చెప్పలేని లేత వయసులో..... అందుకే ఆనాడు కిరీటిని పోగొట్టుకుని మరొకరి భార్యనయ్యాను. విధి ఆడించిన చదరంగంలో పావునై విధవనై ఇలా బ్రతుకు తున్నాను."

"విధవగా మారితే మాత్రం మీ బ్రతుకేమైంది? భార్యగా నేను పొందాల్సిన సుఖాలన్నీ భర్త కాకుండానే దోచుకోగలుగుతున్నారుగా మీరు..."

అనాలోచితంగా శిల్ప అన్న మాటలు కన్య గుండెల్ని తునాతునకలు చేశాయి.

గండిపడినట్టుగా గుండెలవిసేలా ఏడ్చింది కన్య. తనను చూసి అమాయకంగా కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్న నానీని అక్కున చేర్చుకుంది.

చాలాసేపు మౌనంగా వుండిపోయి ఇక వచ్చిన పని అయినట్టుగా పైకి లేచింది.

"శిల్పా!" నిర్వేదంగా పిలిచింది.

"నీ కంటే పెద్దదాన్నయిన నేను విచక్షణా రహితంగా నువ్వుమోపిన నిందలకు బాధపడటం లేదమ్మా... నిజాన్ని గ్రహించలేని నీ అమాయకత్వానికి జాలి పడుతున్నాను. చూడు శిల్పా, ఒక్క విషయాన్ని మాత్రం అర్థంచేసుకో.... ఆడది భర్తలో కోరుకునే అపురూపమైన లక్షణాలన్నింటికి ఓ రూపమిస్తే ఆ రూపానికి పేరు 'కిరీటి' అవుతుంది. నీ పాలిటి అదృష్టంలా నీ జీవితంలోకి అడుగుపెట్టిన కిరీటిని కాదని కోరి శాపగ్రస్తురాలివి కాకు. నీ ఇంట వెలసిన దేవుణ్ని దెయ్యమని భ్రమ పడకు గుండెల గుడిలో ప్రతిష్ఠించుకుని నిత్య నీరాజనాలతో నూరేళ్ళు బ్రతుకు."

శిల్ప తేరుకునే సరికి కన్య అక్కడలేదు.

కన్య విషయంలో తన అక్కసునంతా వెళ్ళకక్కినందుకు లోపల సంతోషంగా వున్నా తను తొందరపడ్డానేమో అనికూడా మదనపడింది.

సాయంకాలం వరకూ అదే ఆలోచనలతో నలిగి పోయిన శిల్ప హఠాత్తుగా యోగేంద్ర రావటంతో కాస్త స్థిమితపడింది.

కిరీటి వివరాలు తెలుసుకోవాలని వచ్చిన యోగేంద్రతో జరిగినదంతా చెప్పకుండా వుండలేకపోయింది శిల్ప .

అమాయకురాలైన కన్య విషయంలో శిల్ప ఎంత మూర్ఖంగా ప్రవర్తించిందీ తెలియగానే తనను తాను నిగ్రహించుకోలేక పోయాడు.

"అందుకే నీ అనుమానాలతో, అహంకారంతో రోజు రోజుకి నువ్వెంత శాడిస్ట్‌గా మారిపోతున్నావో గ్రహించలేక పోతున్నావు శిల్పా!" అన్నాడు పట్టలేని కోపంతో.

కన్య విషయంలో అతడంత సానుభూతి చూపించటం ఆమెకు నచ్చలేదు.... పైగా అతని మాటలు చాలా అవమానంగా కూడా తోచాయి.

"ఎవరేమన్నా నాకు నష్టంలేదు బావా! కిరీటిపై మరెవరి అధికారాన్ని నేను హర్షించలేను

అంతే.'' సీరియస్‌గా  గదిలోకి వెళ్ళిపోయింది.

0 0 0

యోగేంద్ర వెళ్ళేసరికి కన్య లాన్‌లోని యీజీఛైర్‌లో కూర్చుని దీర్ఘంగా ఏదో ఆలోచిస్తోంది.

కన్య ఎంత సాదరంగా  ఆహ్వానించాలని ప్రయత్నించినా ఆమె ముఖంలోని నీలినీడలు ఆమె మానసికంగా  ఎంత కృంగిపోయిందీ గుర్తుచేస్తూనే వున్నాయి.